సాక్షి అనంతపురం

గురువారం । 5 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.32,150

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.32,150 పలికాయి.



ఇదెక్కడి ప్రజాస్వామ్యం?

జేసీ ప్రభాకర్ రెడ్డి మాటలు వింటూ తనను తాడిపత్రికి వెళ్లకుండా ఎస్పీ జగదీష్ అడ్డుకుంటున్నారని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రశ్నించారు. 12లో

గరిష్టం/కనిష్టం 38.1°/22.3°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. గాలివేగం తగ్గింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.




ఉరవకొండలో వెన్నుపోటు దినం ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు, (ఇన్‌సెట్‌లో) డీటీ వరప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వ, తదితరులు




వైఎస్సార్ సీపీ శ్రేణులతో కిటకిటలాడుతున్న రాప్తాడు (ఇన్‌సెట్‌లో) తహసీల్దార్ విజయకుమారికి వినతిపత్రం సమర్పిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రకాష్ రెడ్డి తదితరులు




నార్పలలో జరిగిన ర్యాలీలో పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్‌తో కలిసి నడుస్తున్న శ్రేణులు, (ఇన్‌సెట్‌లో) డీటీ శ్రీనివాస మూర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న శైలజానాథ్

నయవంచనపై ప్రజా గర్జన

సూపర్ సిక్స్‌తో సహా అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదు. ప్రజా సంక్షేమం విస్మరించి అరాచక పాలన సాగిస్తున్నారు. ఈ క్రమంలో కడుపు మండిన ప్రజలు కూటమి సర్కారు వంచనపై గర్జించారు. కూటమి నేతల కుట్రలను ఛేదించుకుని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'వెన్నుపోటు' దినం కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి ఉప్పెనలా కదం తొక్కారు. అధికారులకు వినతిపత్రాలతో నిరసన తెలియజేశారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం

- ర్యాలీల్లో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు
- చంద్రబాబు మోసంపై మండిపాటు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి, నేతలు మహాలక్ష్మి, రమేష్ గౌడ్ తదితరులు



అనంతపురంలో జరిగిన ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి సర్కారు నయ వంచనను ఎండగట్టేందుకు,చంద్రబాబు సర్కార్‌ను మేలుకొలిపేందుకు వైఎస్సార్ సీపీ బుధవారం నిర్వహించిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది.అనంతపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ జరిగింది. అనంతపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

- నార్పలలో మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ స్థానిక వాల్మీకి ఆలయం నుంచి ప్రారంభమై తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. శైలజానాథ్ మాట్లాడుతూ చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీలు భాస్కర్, బోగాతి ప్రతాప్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. ఆయన ఆధ్వర్యంలో రాప్తాడులో నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.
- ఉరవకొండలో సమన్వయకర్త వై. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఉరగాద్రి ఆలయం నుంచి టవర్ క్లాక్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు.
- గుంతకల్లులో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై. వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమికి డిపాజిట్లు రావన్నారు.కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి, గుంతకల్లు ఎంపీపీ మాధవి, గుత్తి పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.
- రాయదుర్గంలో సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ వినాయక సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది.ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత విధానాలతో ప్రజలను మభ్యపెడుతోందన్నారు. సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతూ మహిళలు, రైతులు, యువత ఇలా అన్ని వర్గాలకూ చంద్రబాబు మోసం చేస్తున్నారన్నారు.
- కళ్యాణదుర్గంలో సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. రంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలతో ముందుకెళ్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందన్నారు. ఏడాదిగా ఒక్క హామీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎం మోహన్ రెడ్డి, నేతలు ఉమా, వెంకటేశులు, తిమ్మరాయడు పాల్గొన్నారు.
- యాడికి మండల కేంద్రంలో 'వెన్నుపోటుదినం' నిరసన ర్యాలీ... కార్యక్రమ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు ఆధ్వర్యంలో జరిగింది. వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సుధాకర్ బాబు మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు హర్షవర్ధన్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడలు వంచుతాం..

అనంతపురంలో జరిగిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులతో కాలయాపన చేసిందని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను గుప్పించి ఇంత వరకు ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా పథకాలు అమలు చేయించేలా వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు. అనంతపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు చంద్రబాబు అన్యాయం చేశారన్నారు. హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 3,800 క్యూసెక్కులకే పరిమితం చేసి భవిష్యత్తులో నీటి అవసరాలకు తీవ్ర ఇబ్బంది తలెత్తేలా చేశారన్నారు.



అనంతపురంలో ర్యాలీలో ప్లకార్డు ప్రదర్శిస్తున్న వృద్ధురాలు




రాయదుర్గంలో వెన్నుపోటు దినం ర్యాలీ (ఇన్‌సెట్‌లో) తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మెట్టు, శివరామిరెడ్డి, తదితరులు




కళ్యాణదుర్గంలో నిరసన ర్యాలీ, (ఇన్‌సెట్‌లో) ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న రంగయ్య, ఉమా




గుంతకల్లులో నిర్వహించిన ర్యాలీలో కదం తొక్కుతున్న పార్టీ శ్రేణులు, ప్రజలు, (ఇన్‌సెట్‌లో) ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్




యాడికిలో వెన్నుపోటు దినం ర్యాలీ, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర బాబు

8 మంది తహసీల్దార్లకు స్థానచలనం

అనంతపురం అర్బన్: జిల్లాలో పలువురు తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ కోసం 16 మంది తహసీల్దార్లు దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడతగా 8 మందిని బదిలీ చేశారు.

ఖాళీ స్థానాలను భర్తీ చేయని వైనం..

జిల్లాలో కూడేరు, విడపనకల్లు, వజ్రకరూరు, కణేకల్లు, యల్లనూరు తహసీల్దార్లతో పాటు అనంతపురం ఆర్‌డీఓ కార్యాలయం డీఏఓ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. డీ.హీరేహాళ్ తహసీల్దారును బెళుగుప్పకు బదిలీ చేశారు. శెట్టూరు తహసీల్దారు ఈ నెల 2న ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానంలో కళ్యాణదుర్గం ఆర్‌డీఓ కార్యాలయ డీఏఓని నియమించారు. ఇన్‌చార్జ్ పాలనలో ఉన్న ఆరు మండలాలకు తహసీల్దార్లను, అనంతపురం ఆర్డీఓ కార్యాలయ డీఏఓని తొలి విడతలో నియమించలేదు.

తహసీల్దారు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
బి.అనిల్‌కుమార్ (దీర్ఘకాలిక సెలవు)	డి.హీరేహాళ్	బెళుగుప్ప
సి.షర్మిల	బెళుగుప్ప	డీఏఓ, కళ్యాణదుర్గం ఆర్‌డీఓ కార్యాలయం
ఎన్.ఈశ్వరమ్మ	డీఏఓ (కళ్యాణదుర్గం ఆర్‌డీఓ)	శెట్టూరు
పి.ఉషారాణి	పెద్దవడుగూరు	తాడిపత్రి
పి.రజాక్‌వలి	తాడిపత్రి	గుమ్మఘట్ట
ఎస్.శ్రీనివాసులు	గుమ్మఘట్ట	పెద్దవడుగూరు
ఎస్.యుగేశ్వరిదేవి	కలెక్టరేట్ (కో-ఆర్డినేషన్)	డీ.హీరేహాళ్
పి.శేషారెడ్డి	పుట్లూరు	కలెక్టరేట్ (కో-ఆర్డినేషన్,సూపరింటెండెంట్)

డీఎస్సీ పరీక్షలకు వేళాయె

అనంతపురం ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 30 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. బెంగళూరులో రెండు కేంద్రాలు కలిపి మొత్తం డీఈఓ పరిధిలో 10 కేంద్రాలు ఉంటాయి. రోజూ రెండు విడతలుగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు సాగుతాయి. మొత్తం 45,186 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. బెంగళూరులోని కేంద్రాలకు ఇద్దరు హెచ్ఎంలను డీఓలుగా నియమించారు.

ఏర్పాట్లు సిద్ధం..

అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుంది. అత్యవసర వైద్య సాయం కోసం ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలు అనుమతించరు. అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపుకార్డుతో గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష కేంద్రాల పూర్తి వివరాలు deoananthapuramu.blogspot.com వెబ్‌సైట్‌లో ఉంచారు. ఏవైనా సందేహాలుంటే cse.ap.gov.in వెబ్‌సైట్ సంప్రదించవచ్చని డీఈఓ ఎం.ప్రసాద్ బాబు తెలిపారు. హాల్‌టికెట్లలో పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు తదితరాల్లో తప్పులుంటే అభ్యర్థులు వారి ఒరిజినల్ పదో తరగతి మార్కుల జాబితా, ఇతర సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లను పరీక్ష కేంద్రాల్లో ఉండే డిపార్ట్‌మెంట్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. వారు సవరించేందుకు ఉన్నతాధికారులకు పంపుతారు.

పరీక్ష కేంద్రాలివే...

- శ్రీనివాస రామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రోటరీ పురం, బుక్కరాయసముద్రం మండలం.
- అనంతలక్ష్మీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్సెస్ ఇటుకలపల్లి.
- శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హంపాపురం, రాప్తాడు.
- నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషియల్ ఆక్షన్ ఇండియా, చిన్మయా నగర్, ఎల్ఆర్‌జీ స్కూల్ పక్కన, ప్రసన్నాయపల్లి, రాప్తాడు మండలం.
- గేట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎన్‌హెచ్–44 పక్కన, గుత్తి అనంతపురం, పెద్దవడుగూరు మండలం.
- సర్ సీవీ రామన్ ఇన్‌స్టిటూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, తాడిపత్రి.
- పీవీకేకే ఇనిస్టిటూట్ ఆఫ్ టెక్నాలజీ, రుద్రంపేట, అనంతపురం రూరల్.
- సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వెనుక, ప్రశాంతిగ్రాం, పుట్టపర్తి
- బిట్‌బైటెక్ సొల్యూషన్స్, సీ348, మూడోఫ్లోర్, ఫస్ట్‌మెయిన్, పోలీస్ స్టేషన్ రోడ్డు, పీన్య ఫస్ట్‌స్టేజ్, బెంగళూరు.
- టెక్సలెన్స్ డిజిటల్ సొల్యూషన్స్, ప్రగతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, నం. 57, సర్వేపల్లి రాధాకృష్ణన్ రోడ్డు, చిక్కబనవారా, బెంగళూరు.

క్లుప్తంగా

పర్యావరణ దినోత్సవ ఏర్పాట్లు బాగుండాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. లోటుపాట్లకు తావివ్వకుండా నిర్వహణ ఏర్పాట్లు బాగుండాలన్నారు. పర్యావరణ దినోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఆత్మకూరు మండలం పంపనూరు సమీపంలోని నగర వనంలో జిల్లా స్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. గురువారం తరువాత ప్రతి రోజు ఒక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమంలో తాను పాల్గొంటానన్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2025 పోస్టర్లను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. సమీక్షలో అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ గురుప్రభాకర్, డ్వామా పీడీ సలీంబాషా, డీపీఈఓ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, నగర పాలక కమిషనర్ బాలస్వామి, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ మునిప్రసాద్, డీసీఓ అరుణకుమార్, ఉద్యాన శాఖ డీడీ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

48 పట్టాదారు పాసు బుక్కుల రద్దు

గుత్తి: మండలంలోని ఊటకల్లు రెవెన్యూ పరిధిలో గుర్తించిన 48 దొంగ పట్టాదారు పాస్ బుక్కులను సంబంధిత అధికారులు రద్దు చేశారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల ఆర్డీఓ శ్రీనివాస్ విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో తహసీల్దార్ ఓబులేసు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లత, వీఆర్వోలు వారం పాటు విచారణ చేశారు. మొత్తం 48 మంది దొంగ పట్టాదారు పాస్ బుక్కులు కలిగినట్లుగా గుర్తించారు. వీరిలో కొందరు ప్రభుత్వ భూములకు పాస్ బుక్కులు చేయించుకోగా, మరి కొందరు భూములు లేకున్నా పాస్ బుక్కులు పొంది రైతు భరోసా, బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. మండల వ్యాప్తంగా మరో 50 కి పైగా దొంగ పట్టాదారు పాసు బుక్కులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై బుధవారం తహసీల్దార్ ఓబులేసు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ లతను వివరణ కోరగా ఊటకల్లులో 48 దొంగ పట్టాదారు పాసు బుక్కులను రద్దు చేసిన మాట వాస్తవమేనన్నారు. మండల వ్యాప్తంగా విచారణ చేస్తున్నామన్నారు. విచారణలో దొంగ పట్టాదారు పాసు బుక్కులు ఉన్నట్లు తేలితే రద్దు చేస్తామన్నారు. దొంగ పట్టాదారు పాసు బుక్కులతో రైతు భరోసా, బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారిపై తదుపరి చర్యలు ఆర్డీఓ తీసుకుంటారన్నారు.

ఉద్రిక్తత నడుమ సేవ్ ఆర్డీటీ

- ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రను అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- ఉద్రిక్తతల మధ్య సాగిన మొదటి రోజు పాదయాత్ర



ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, తలారి రంగయ్య, వై.విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, గోరంట్ల మాధవ్ తదితరులు



రంగయ్య పాదయాత్రను అడ్డుకుంటున్న పోలీసులు

కళ్యాణదుర్గం/ బెళుగుప్ప: కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపు మేరకు బుధవారం చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రను పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు బెళుగుప్ప మండలం గొంచితండా నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. భారీ సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు, ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమానికి అనుమతులు లేవంటూ గొంచితండా నుంచి బ్రాహ్మణపల్లి వరకూ అడుగడుగునా కళ్యాణదుర్గం, గుంతకల్లు, డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసు వాహనాలను రహదారికి అడ్డంగా పెట్టారు. పాదయాత్రను భగ్నం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. ఒకానొక దశలో ఒక్కసారిగా తలారి రంగయ్యను చుట్టుముట్టి బలవంతంగా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పి ఉద్రిక్తత చోటు చేసుకుంది. రంగయ్యను తమ భుజాల మీదకు ఎత్తుకుని పోలీసుల వలయాన్ని ఛేదించుకుని కార్యకర్తలు ముందుకు సాగారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ తొలి రోజు పాదయాత్ర గొంచితండా నుంచి రాయదుర్గం – కళ్యాణదుర్గం ప్రధాన రహదారి మీదుగా కొత్త బ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, నరసాపురం, బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామం వరకూ సాగింది.

ఆర్డీటీ పరిరక్షణ అందరి బాధ్యత

గొంచితండాలో ఏర్పాటు చేసిన పాదయాత్ర ప్రారంభోత్సవ సభలో తలారి రంగయ్యతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాయకులు మహాలక్ష్మి శ్రీనివాస్, ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, చందన శివాజీ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్డీటీ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కరువు జిల్లా అనంతలో పేదరికం రూపుమాపేందుకు 50 సంవత్సరాలుగా ఆర్డీటీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఆర్డీటీ సేవలను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. రమనేపల్లి సర్పంచ్ రమేష్, నరసాపురం ఎంపీటీసీ సురేష్, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులు, ఆర్డీటీ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనంతపురం-బెంగళూరు ప్యాసింజర్ రైలు ప్రారంభం



రైలును ప్రారంభించిన ఎంపీ అంబికా

అనంతపురం సిటీ: అనంతపురం–బెంగళూరు మధ్య ప్యాసింజర్ రైలును బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సునీత, డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలసి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పచ్చ జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అనంతపురం నుంచి బెంగళూరుకు రూ.50కే చేరుకోవచ్చన్నారు. 12 బోగీలుంటాయన్నారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లో వాటరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని డీఆర్ఎంకు సూచించారు. మెమూ రైలు సాయంత్రం బెంగళూరు నుంచి అనంతపురానికి బయలుదేరేలా చూడాలని ఎమ్మెల్యే సునీత కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ గుత్తా కేశవ నాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే డీజీఎం ఉదయ్‌నాథ్, రైల్వే సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎంఓ శ్రవణ్ కుమార్, సీనియర్ డీఈఈ సుదర్శన్‌రెడ్డి, ఏడీఆర్ఎం సుధాకర్, అనంతపురం రైల్వే స్టేషన్ మాస్టర్ అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘వీర’బాదుడుతో సెంచరీ



125 పరుగులు చేసిన కోగటం హనీష్ వీరారెడ్డి

అనంతపురం: వైఎస్సార్ జిల్లా కడపలో జరుగుతున్న అండర్–23 అంతర జిల్లా క్రికెట్ టోర్నీలో బుధవారం జరిగిన అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌లో అనంత బ్యాటర్ కోగటం హనీష్ వీరారెడ్డి వీరబాదుడుతో బంతిని బౌండరీలు దాటించి 125 పరుగులు సాధించాడు. 69 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో చెలరేగిపోయాడు. కాగా, తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు పది వికెట్ల నష్టానికి 217 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో లోహిత్ లక్ష్మీ నారాయణ 80 పరుగులు, కె.రెడ్డిరుషీల్ 60 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు ఓపెనర్ కోగటం హనీష్‌వీరారెడ్డి 125 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. మరో బ్యాటర్ పి.అర్జున్ టెండూల్కర్ 27 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో తొలి సెంచరీ సాధించిన కోగటం హనీష్ వీరారెడ్డిని జట్టు సభ్యులు, కోచ్‌లు అభినందించారు.

ఎస్పీ గారూ.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం?

- హత్యా రాజకీయాలను ప్రోత్సహించొద్దు
- కావాలంటే రాజీనామా చేసి టీడీపీ తరఫున పోటీ చేయండి
- కోర్టు అనుమతి ఇచ్చినా జేసీ మాట విని అడ్డుకుంటారా?
- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ధ్వజం





పార్టీ శ్రేణులతో కలసి నడుచుకుంటూ వస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, డీఎస్పీతో మాట్లాడుతున్న పెద్దారెడ్డి

యల్లనూరు: ‘హైకోర్టు ఆర్డర్ తెచ్చుకుంటే తాడిపత్రికి పంపుతానని హామీ ఇచ్చారు. న్యాయస్థానం నుంచి ఆ మేరకు ఉత్తర్వులు తెచ్చుకుంటే ఏవేవో కారణాలు చెబుతూ అడ్డుకుంటున్నారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యమో అర్థం కావడం లేదు. జిల్లా ఎస్పీ గారు.. హత్యా రాజకీయాలను ప్రోత్సహించొద్దు. కావాలంటే ఉద్యోగానికి రాజీనామా చేసి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేయండి’ అంటూ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు యాడికి మండలంలో ‘వెన్నుపోటు దినం’ ర్యాలీలో పాల్గొనేందుకు కార్యకర్తలతో బయల్దేరిన పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు తెల్లవారుజామునే డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పెద్ద ఎత్తున పెద్దారెడ్డి స్వగ్రామమైన మండలంలోని తిమ్మంపల్లికి చేరుకున్నారు. ఇంటి నుంచి మాజీ ఎమ్మెల్యే బయటకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. ‘మీరు కాకుండా మీ తరఫున ఎవరైనా యాడికి వెళ్లొచ్చు’ అంటూ డీఎస్పీ తెలుపగా పెద్దారెడ్డి తన కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిని పంపించారు. ఈ క్రమంలోనే తనను ఎస్పీ వద్దకు తీసుకెళ్లాలని పెద్దారెడ్డి పోలీసులు పట్టుబట్టగా పోలీసులు నిరాకరించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎస్పీ తీరుపై విమర్శలు గుప్పించారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట వింటూ తనపై ఎస్పీ జగదీష్ కక్ష కట్టారని మండిపడ్డారు. కోర్టు ఆర్డర్‌ను సైతం పక్కన పెట్టడం అన్యాయమన్నారు. పోలీసుల వరకు వస్తే చట్టాలు.. మా వరకు వస్తే సాకులు చెబుతారా అని ప్రశ్నించారు. ఎస్పీకి ఆరు సార్లు మెయిల్ పెట్టినా పట్టించుకోలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము ఎప్పుడూ ఇలా వ్యవహరించలేదన్నారు. భవిష్యత్తులో మళ్లీ అధికారంలోకి వస్తామని, అన్నీ వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ఇటీవల తిమ్మనచెరువు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడులు చేస్తే పోలీసులు కేసులు నమోదు చేయలేదన్నారు. ఇదేం ప్రజాస్వామ్యం అని పెద్దారెడ్డి దుయ్యబట్టారు. తాడిపత్రి జేసీ నాగిరెడ్డి జాగీరు కాదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు వెంకటేష్ నాయుడు, నాయకులు గొడ్డుమర్రి ఈశ్వర్‌రెడ్డి, దంతలపల్లి పెద్దిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కల్లూరు సూరి, కొత్తపల్లి పురుషోత్తం నాయుడు, వెంకటాంపల్లి శంకర్‌రెడ్డి, యల్లనూరు కిరణ్, చిలమకూరు జనార్దన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘రెడీనెస్’ గోల

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీల ప్రక్రియ ముగియక ముందే గురువారం నుంచి పాఠశాలల్లో రెడీనెస్ (పాఠశాలల సంసిద్ధత) కార్యక్రమాలు చేపట్టాలంటూ ఉపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. వాస్తవానికి బదిలీల షెడ్యూలు ఈ నెల 10, 11 తేదీల నాటికి పూర్తయి 12న స్కూళ్లు పున:ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రెడీనెస్ కార్యక్రమం చేపట్టాలంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్వర్లుపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. కాగా, రెడీనెస్ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని బుధవారం సాయంత్రం డీఈఓ ప్రసాద్ బాబును ఉపాధ్యాయ సంఘాల నాయకులు వేర్వేరుగా కలిసి విన్నవించారు. డీఈఓను కలిసిన వారిలో నీలూరి రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు, మల్లికార్జున సురేష్ కుమార్, రాయల్ వెంకటేష్, ఎస్. సిరాజుద్దీన్, సర్దార్ వలి, సతీష్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటరత్నం ఉన్నారు.

వాయిదాపై స్పష్టత లేమి

గురువారం నుంచి చేపట్టాల్సిన రెడీనెస్ ప్రోగ్రాంను వాయిదా వేసినట్లు ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో ప్రచారం జరిగింది. రాష్ట్ర అధికారుల పేరుతో వైరల్ కావడం గమనార్హం. అయితే జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం రాత్రి 11 గంటలు దాటినా దీనిపై స్పష్టత ఇవ్వలేదు.

నిత్యావసర సరుకుల రవాణా సక్రమంగా జరగాలి : జేసీ

రాప్తాడు: ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌక దుకాణాలకు నిత్యావసర సరుకుల రవాణా సక్రమంగా జరగాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. బుధవారం రాప్తాడు మండలంలోని పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చౌక దుకాణాలకు నిత్యావసర సరుకుల రవాణా నిర్దిత సమయంలో జరగాలని లేకపోతే సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమయానుగుణంగా పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగించి కొత్త వారిని నియమించుకుంటామని ఎంఎల్ఎస్ పాయింట్‌లోని హమాలీలకు సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయీస్ డీఎం రమేష్‌రెడ్డి, తహసీల్దార్ విజయకుమారి, ఆర్ఐ రాగే కిరణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

9న రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రం ప్రారంభం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ కేంద్రాన్ని ఈ నెల 9న సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూ(ఏ) పాలక భవనాన్ని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. అడ్మిన్ బిల్డింగ్‌లో క్లీనింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ పనులు, అవసరం మేరకు ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ వి. రాజగోపాల్, జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప రెడ్డి పాల్గొన్నారు.

రైలు కిందపడి ఇద్దరి మృతి



చల్లవారిపల్లి వద్ద రైల్వే పోలీసులు గుర్తించిన వ్యక్తి మృతదేహం

తాడిపత్రి రూరల్: మండలంలోని చల్లవారిపల్లి వద్ద బుధవారం రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. వయస్సు 40సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కోరారు.

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని గార్లదిన్నె–తాటిచెర్ల రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి (50) దుర్మరణం పాలయ్యాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగి ఉంటుందని జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి పట్టాలపై ఛిద్రమై పడి ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని సర్వజనాస్పత్రిలోని మార్చురీకి తరలించామన్నారు. వ్యక్తి మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా ఉంటే అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో గురువారం నుంచి రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమాన్ని ఆత్మకూరు మండలం పంపనూరులో కలెక్టర్ వినోద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మిగతా మండలాల్లో శుక్రవారం నుంచి మొదలవుతుందని తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 90 కిలోలు (3 బస్తాలు) పంపిణీ చేస్తామన్నారు.

బంగారు వ్యాపారిని బురిడీ కొట్టించిన ‘కిలేడీ’

కణేకల్లు: స్థానిక ఓ బంగారు వర్తకుడిని ఓ మహిళ మోసగించి 5 గ్రాముల బంగారు గొలుసుతో ఉడాయించింది. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం కణేకల్లులోని ఆర్‌కే జువెలర్స్‌కు ఓ మహిళ వెళ్లి 5 గ్రాముల గోల్డ్‌చైన్ కావాలని అడిగింది. దీంతో దుకాణంలో పనిచేస్తున్న వారు చూపించగా అందులో ఒకదానిని ఎంపిక చేసుకుని ఫోన్‌పే ద్వారా తన భర్త డబ్బు పంపుతాడని తెలిపి ఫోన్ నంబర్ తీసుకుని భర్తకు మెసేజ్ చేసింది. అనంతరం రూ.45 వేలు ఫోన్ పే ద్వారా పంపినట్లు దుకాణం యజమాని వంశీ ఫోన్‌కు టెక్స్ట్ మెసేజ్ వచ్చింది. దీనికి సంబంధించి వాట్సాప్ ద్వారా అందుకున్న స్క్రీన్ షాట్‌ను సదరు మహిళ చూపించడంతో దుకాణం యజమాని బంగారు చైన్‌ను అప్పగించాడు. మరుక్షణమే ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయింది. బుధవారం ఫోన్‌పే హిస్టరీని పరిశీలించిన యజమాని తన ఖాతాలో రూ.45 వేలు జమ కాకపోవడంతో మోసపోయినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సదరు మహిళ ఉరవకొండలోనూ ఇదే తరహాలో మోసానికి పాల్పడినట్లుగా సమాచారం.

యువతకు ఉచిత శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ కోర్సులపై శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బేసిక్స్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీసు, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్స్ స్పోకెన్ ఇంగ్లీషు, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ తదితర అంశాలపై 60 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఇంటర్, డిప్లొమా పాస్, డిగ్రీ, ఇంజనీరింగ్ పాస్ లేదా ఫెయిల్ అయి.. 20 నుంచి 35 సంవత్సరాల వయసున్న వారు అర్హులు. శిక్షణ తర్వాత సర్టిఫికెట్‌తో పాటు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 73969 50345, 77807 52418లో సంప్రదించవచ్చు.

‘10న కలెక్టరేట్ ఎదుట ధర్నా’

కూడేరు: శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట కార్మికులు, వారి కుటుంబసభ్యులతో కలసి ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు తెలిపారు. పెండింగ్ వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కూడేరు మండలం పీఏబీఆర్ లోని శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడారు.

ఎమ్మెల్యే అమిలినేనికి త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఎమ్మెల్యే కారు

కళ్యాణదుర్గం: కర్ణాటకలోని బాగేపల్లి వద్ద కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బుధవారం ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడ్డారు.

పేదోడి ఆకలి తీరాలంటే జగన్ సీఎం కావాలి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న సుధాకర్‌బాబు

తాడిపత్రి టౌన్: పేదోడి ఆకలి తీరాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌బాబు అన్నారు. వైఎస్ జగన్‌ను సీఎంగా చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో బుధవారం జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... ఎన్నికల వాగ్దానాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా సీఎం చంద్రబాబు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఈ వెన్నుపోటును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు. తాడిపత్రిలో అప్రజాసామ్యం రాజ్యమేలుతోందన్నారు. ఇక్కడ పోలీస్ వ్యవస్థ లేదన్నారు. ప్రజాస్వామ్యం అనేది కంటికి కూడా కనిపించదన్నారు. వింత పోకడలు, విచిత్ర పోకడలతో ఇక్కడ రాక్షస రాజ్యం నడుస్తోందన్నారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని అక్రమంగా నిర్బంధిస్తున్నారన్నారు. నిర్బంధాలను ఛేదించుకుని ఏదో ఒక రోజు పెద్దారెడ్డి బయటకు రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత, యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

‘రిక్వెస్ట్’ కాస్త ‘కంపల్సరీ’ అయింది

- ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తున్న బదిలీల సాఫ్ట్‌వేర్
- రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే ‘కంపల్సరీ’గా చూపిస్తున్న వైనం

- తాడిపత్రిలోని ప్రభుత్వ స్కూల్‌లో పని చేస్తున్న బయాలజీ సైన్స్ టీచరు మరో 8 నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్నారు. నాలుగేళ్లుగా ఆమె ఈ స్కూల్‌లోనే పనిచేస్తున్నారు. ఆమె సబ్జెక్టుకు సంబంధించి అనంతపురంలో ఖాళీలు ఉండడంతో రిక్వెస్ట్ బదిలీ కింద దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం వెబ్ ఆప్షన్లు ఇచ్చే క్రమంలో అనంతపురం స్కూళ్లు మాత్రమే ఆప్షన్ ఇచ్చి తర్వాత తాను పని చేస్తున్న స్కూల్ కనబరిచి సబ్‌మిట్ చేయబోతే సిస్టం అంగీకరించలేదు. తప్పనిసరి బదిలీల టీచర్లు లాగానే జిల్లాలో మీ సబ్జెక్టులో ఉన్న అన్ని ఖాళీలకు ఆప్షన్ ఇచ్చుకోవాలంటూ సూచన కనిపించింది.



వినతిపత్రాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: బదిలీలకు సంబంధించి అందుబాటులోకి తీసుకువచ్చిన సాఫ్ట్‌వేర్ ఉపాధ్యాయులకు చుక్కలు చూపిస్తోంది. ఒకే స్కూల్‌లో 8 ఏళ్ల సర్వీస్ పూర్తయితే తప్పనిసరిగా బదిలీ కావాల్సిందే. కనీసం రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. తప్పనిసరిగా బదిలీ అయ్యే టీచర్లు వారు పని చేసిన స్కూల్ కాకుండా ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీలన్నీ ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్ ఇచ్చుకోవాలి. రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వారు.. వారు పని చేస్తున్న స్కూల్ కంటే కూడా ఇంకాస్త సౌకర్యంగా ఉన్న స్కూళ్లు మాత్రమే ఆప్షన్ ఇచ్చి...చివరగా తాను పని చేస్తున్న స్కూల్ ఆప్షన్ ఇచ్చుకోవాలి. ఆప్షన్లు ఇచ్చుకున్న స్కూళ్లు రాకపోతే... చివరకు పని చేస్తున్న స్కూల్‌నే నిర్ధారిస్తారు. అయితే రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారికి కూడా తప్పనిసరి బదిలీ కింద చూపుతుండడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైంది. సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో లోపమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో పలువురు నగరంలోని శారదా స్కూల్‌కు పరుగులు తీసి డీఈఓ ప్రసాద్‌బాబు వద్ద తమ గోడు వెల్లబోసుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు ముగిసిన ఆప్షన్లు

స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో భాగంగా వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకునేందుకు బుధవారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. అప్పటికి వీరి సమస్య పరిష్కారం కాలేదు. తప్పనిసరి బదిలీ టీచర్లు లాగా ఎక్కడిపడితే అక్కడికి బదిలీ అవుతామనే ఆందోళన రిక్వెస్ట్ బదిలీ ఉపాధ్యాయుల్లో వ్యక్తమవుతోంది.

రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కొందరు టీచర్లు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నా టెక్నికల్ సమస్య కారణంగా కంపల్సరీ బదిలీగానే చూపిస్తోంది. బాధితులు వచ్చి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ ఆందోళన చెందొద్దు. సమస్య పరిష్కారమవుతుంది.

– ఎం.ప్రసాద్‌బాబు డీఈఓ

తిరుగుబాటు తప్పదు చంద్రబాబు

- వ్యవస్థలను అడ్డంపెట్టుకుని హత్యలు, దౌర్జన్యాలు చేస్తున్న ప్రభుత్వం
- నాలుగు లక్షల మందికి పింఛన్ కట్
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి ఆగ్రహం
- జిల్లా కేంద్రంలో 'వెన్నుపోటు దినం' ర్యాలీ సక్సెస్


ర్యాలీగా వెళ్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, నరేష్‌కుమార్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ఏడాది కూటమి ప్రభుత్వంలో ఒక్క హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చలేదు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు రావాల్సిన రూ.75 వేల కోట్లకు ఎగనామం పెట్టారు. ప్రభుత్వంపై గళం విప్పితే వ్యవస్థలను అడ్డం పెట్టుకుని హత్యలు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు కేసులు బనాయిస్తోంది. చంద్రబాబు నువ్వు మారకపోతే ఏపీలో తిరుగుబాటు తప్పక వస్తుంది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ జిల్లా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ పాతూరు చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి పాతూరు గాంధీ విగ్రహం, వన్‌టౌన్, సంగమేశ్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. వైఎస్సార్‌సీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి, తదితరులతో కలసి పాతూరు గాంధీ విగ్రహం, అంబేడ్కర్ నగర్‌లోని జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతంలో 66 లక్షల మందికి పింఛన్ ఇవ్వగా.. కూటమి ప్రభుత్వంలో గత నెల గణాంకాలను పరిశీలిస్తే 62 లక్షల మందికి మాత్రమే పింఛన్ అందించారన్నారు. నాలుగు లక్షల మందికి పింఛన్ కోత పెట్టి వికలాంగులను ఉసూరుమనిపించారన్నారు.

ఎందుకు పండుగ చేసుకోవాలి కళ్యాణ్?

డిప్యూటీ సీఎం హోదాలో ఉంటూ ఏడాదిగా ప్రజలకు ప్రభుత్వం పథకాలు అమలు చేయనందుకు పండుగ చేసుకోవాలా? లేక మీ అన్నకు ఎమ్మెల్సీ ఇచ్చినందుకు పండుగ చేసుకోవాలా? పవన్ కళ్యాణ్ అంటూ డిప్యూటీ సీఎంను అనంత ప్రశ్నించారు. సీఎంగా వైఎస్ జగన్ దిగిపోయి ఏడాది అవుతోందని అందుకు పండుగ చేసేకోవాలని జనసేన చేసిన వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు.

సంపద ఎక్కడ సృష్టించావు బాబూ?

ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పారని.. అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని నెరవేర్చలేదని అనంతపురం పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన ప్రతి పథకాన్ని అమలు చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు ప్రసంగించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు అశ్వర్థ్ నాయక్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి మారుతీనాయుడు, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, మల్లెమీద నరసింహులు, శ్రీదేవి, సైఫుల్లాబేగ్, చంద్రశేఖర్ యాదవ్, చింతా సోమశేఖర్ రెడ్డి, బాకే హబీబుల్లా, కే.శ్రీనివాస రెడ్డి, ఓబిరెడ్డి, కోనా రాజారెడ్డి, ఉమాపతి, నాయకులు పామిడి వీరాంజనేయులు, గొని నాగన్న, మార్కెట్ ఖాజా, ఖాజా, దాదు, బాబా సలాం, ఆసిఫ్, దత్త, కైలాష్, మీసాల రంగన్న, కొర్రపాడు హుస్సేన్ పీరా, రాజశేఖర్ యాదవ్, రాజారత్నం, అనిల్ కుమార్ గౌడ్, తనీష, కృష్ణవేణి, సుజాత రెడ్డి, భూమిరెడ్డి జాహ్నవి, భారతి, దేవి, అంకిరెడ్డి ప్రమీళ, ఎగ్గుల శ్రీనివాసులు, ఉష, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అత్యుత్సాహం

3వ పట్టణ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. వెన్నుపోటు దినం ర్యాలీకి అనుమతి లేదంటూ నగరంలోని 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాలలో పలువురు యువజన నాయకులను అడ్డుకున్నారు.

మోసం చేయడం బాబుకు అలవాటే..

- సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను వెన్నుపోటు పొడిచారు
- కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై రాజీలేని పోరాటం చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


కార్యకర్తలతో కలసి ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: 'అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయడం, వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయకుండా మోసం చేశారు. చంద్రబాబు నాయుడి దుర్మార్గపు పాలనను అంతం చేసేంత వరకు వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు రాజీలేని పోరాటం చేయాలి' అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద మొదలైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం మీదుగా స్థానిక బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ వైఎస్సార్‌సీపీ నాయకులతో మానవహారం ఏర్పాటు చేసి చంద్రబాబు నాయుడు, సూపర్ సిక్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ విజయ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో ఇసుక, మట్టి, బ్రాందీ షాపులు, టమాట మండిపై శ్రీరామ్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారా లేదా అని అడిగారు. సీసాకు పది రూపాయలు, టమాట మండిలో ఒక లోడుకు రూ.2,500, మట్టి టిప్పరుకు రూ.2,500 వసూలు చేస్తున్నారన్నారు. నసనకోట దేవాలయంలోనూ దోపిడీ చేస్తున్నట్లు తెలిపారు. అక్కడ కూడా సీసాకు రూ.50 వసూలు చేస్తున్నారన్నారు. గతంలోనూ రైల్వే పనులు చేపట్టిన సిద్దార్థ్ కన్‌స్ట్రక్షన్స్ కందుకూరు, జంగాలపల్లి చెరువులు లూటీ చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేరూరు డ్యాంకు నీళ్లు తేస్తే.. మీరు వచ్చిన తర్వాత రిపేరీ పేరుతో డ్యాం గేట్లు పీకేసి కూర్చున్నారన్నారు. డ్యాంకు ఎగువ, దిగువ ఉన్న మట్టి, ఇసుకంతా కర్ణాటకకు తరలిస్తున్నారని మండిపడ్డారు. తాటిచెర్ల నుంచి చిగిచెర్ల వరకు రూ.85 కోట్లతో ఓ కంపెనీ పనులు చేపడుతుంటే వారితో 5 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. రాప్తాడులో సునీత సోదరుడు ధర్మవరపు మురళీ సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాప్తాడుకు చెందిన చిగిచెర్ల నారాయణ రెడ్డి తన భూమిని సెటిల్‌మెంట్ చేసుకోవడానికి మురళి దగ్గరకి వెళ్తే 6.20 ఎకరాల భూమిని ఒక కోటికి ఇమ్మని మురళి అడిగితే ఇవ్వనని చెబితే.. టీడీపీ నాయకులు రాప్తాడులో భార్యాభర్తలు చిగిచెర్ల నారాయణ రెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మను అత్యంత దారుణంగా వేటకొడవళ్లతో నరికి చంపారన్నారు. రామగిరి మండలంలో కురుబ మజ్జిగ లింగమయ్య వైఎస్సార్‌సీపీ జెండా వైపు నిలిచాడనే కారణంతో పరిటాల సునీత బంధువులు దారుణంగా హత్య చేశారని గుర్తు చేశారు. 20 మంది ఆ దాడిలో పాల్గొంటే ఇద్దరిపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. హంద్రీ-నీవా పనులను ఆపాలనే డిమాండ్‌తో తోపుదుర్తిలో నిరాహార దీక్ష చేపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐడీసీ మెంబర్ బుక్కచెర్ల నల్లప రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ విభాగం కన్వీనర్ అమర్‌నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంకే లక్ష్మన్న, కురుబ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ పార్వతమ్మ, జెడ్పీటీసీలు చంద్రకుమార్, మెట్టు గోవింద్ రెడ్డి, ఎంపీపీలు మజ్జిగ అంజలి, కుంపటి భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


అనంతపురం: కూటమి సర్కారు హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న మహిళలు


అనంతపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సందడి


అనంతపురంలో కదంతొక్కుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు


రాప్తాడు: ర్యాలీలో భారీగా పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు, అభిమానులు

క్లుప్తంగా

ఢిల్లీ పర్యావరణ సదస్సుకు ఆహ్వానం


మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ఢిల్లీలో ఈనెల 5న జరిగే పర్యావరణ సదస్సుకు మేయర్ వసీంకు ఆహ్వానం అందింది. భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న న్యూఢిల్లీలో సదస్సు నిర్వహిస్తోంది. ఆ సదస్సులో మేయర్ వసీం పాల్గొననున్నారు. దేశ వ్యాప్తంగా 130 నగరాల్లో అనంతపురం క్రియాశీలక భాగస్వామ్యం ఉందని.. ఎన్ క్యాప్ నిధులతో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు అనంతపురంలో జరిగాయని మేయర్ వసీం పేర్కొన్నారు.

50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఏపీయూడబ్ల్యూజే నాయకులు విన్నవించారు. కలెక్టర్‌ను బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ఇతర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారి వినతిపై కలెక్టర్ స్పందించారు. అంశంపై మెమో జారీ చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకట్రెండు రోజుల్లో మెమో విడుదల చేస్తామని చెప్పారు. కార్యదర్శి చలపతి, సభ్యులు అక్కులప్ప, భూమిరెడ్డి, చౌడప్ప, వెంకటరెడ్డి, సాయి పాల్గొన్నారు.

రేపు నిర్జల ఏకాదశి

అనంతపురం కల్చరల్: భవసార క్షత్రియ సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక రామనగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నిర్జల ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి ఆనంద్ బుధవారం ఓ ప్రటనలో తెలిపారు.

శ్రీక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


హోమం చేస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్, అర్చకులు

అనంతపురం కల్చరల్: శ్రీక్షేత్రంలో కొలువు దీరిన వివిధ దేవతామూర్తుల బ్రహ్మోత్సవాలు బుధవారం నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. జిల్లా శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో తపోవనంలోని లక్ష్మీ హయగ్రీవాలయం దశమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ధ్వజారోహణంతో సంప్రదాయసిద్ధంగా వేడుకలకు అంకురార్పణ చేశారు. అనంతరం ఆలయంలో దివ్యప్రబంధ పారాయణం, నవకలశ స్నాపనం, సుదర్శన హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ సలహాదారుడు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్ నేతృత్వంలో స్వామి వారి విగ్రహాలను తలపై పెట్టుకుని వైష్ణవ సంప్రదాయంలో హోమం, పూజలు జరిపించారు. సాయంత్రం మహిళలు దీపోత్సవం నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది. మరో రెండు రోజుల పాటూ బ్రహ్మోత్సవ వేడుకలు జరగనున్నాయి. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ధర్మవరం విజయకుమార్, అంబాళం వెంకటనారాయణ అయ్యంగార్, రఘు, రాఘవేంద్ర, భరద్వాజ్, మహిళా మండలి సభ్యులు శైలజ, శ్రీమతి, విష్ణు చేతన, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పాపంపేటలో రేషన్‌షాపులపై కొరడా

- జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జేసీ శివ్‌నారాయణ్‌శర్మ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని రేషన్‌షాపులపై జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ కొరడా ఝులిపించారు. బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రేషన్‌షాపులు 54, 57లను పరిశీలించారు. రెండు షాపుల్లోనూ సరుకు నిల్వలలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. 6ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 54, 57 రేషన్ షాపుల డీలర్లపై 6-ఏ కేసులు, క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్‌షాపుల డీలర్లు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. అలాగే 65 సంవత్సరాలు వయస్సు దాటిన వారికి ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టి.వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ జగన్ మోహన్ రావు, సీఎస్‌డీటీ రామకృష్ణ, ప్రశాంత్ బాబు పాల్గొన్నారు.

వైభవంగా వలీస్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: అవధూత స్వరూపుడు వలీస్వామి 14వ ఆరాధన బుధవారం కనుల పండువగా సాగింది. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఉన్న సద్గురు వలీస్వామి ఆశ్రమం, కొల్హాపూరు మహాలక్ష్మి దేవాలయ ప్రాంగణంలో ఉదయం వేదపండితుడు తెలకపల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సామూహిక భజనలతో ఆరాధనను ప్రారంభించారు. వివిధ దేవతామూర్తులను కీర్తిస్తూ వందలాది మంది భక్తులు వివిధ రకాల వాయిద్యాలతో గాన లహరి నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున నారాయణ సేవ పేరుతో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సాగిన ప్రత్యేక ఆధ్యాత్మిక సమావేశంలో భక్తులు వలీస్వామితో అనుబంధాన్ని పంచుకున్నారు. అంతకుముందు ఆశ్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో వెంకటాపురం గ్రామంలోని సద్గురు వలీస్వామి సమాధి వద్దకు వెళ్లి విశేష పూజలు జరిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు టీసీ జయచంద్రారెడ్డి, సీనియర్ గాయకులు పాలసముద్రం నాగరాజు, కొండారెడ్డి, కేవీఎస్ చలపతిరెడ్డి, చెన్నారెడ్డి, కుముదమ్మ, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు కఠిన చర్యలు

- గుంతకల్లు రైల్వే డీఎస్పీ హర్షిత చంద్ర



అనంతపురం సిటీ: రైళ్లలో చోరీల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్లు రైల్వే డీఎస్పీ హర్షిత చంద్ర తెలిపారు. బుధవారం అనంతపురంలోని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రైళ్లలో జరిగిన చోరీల నేపథ్యంలో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సంయుక్తంగా కలసి ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైళ్లల్లో చోరీలకు పాల్పడినా, రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే ఎటువంటి చర్యలనూ ఉపేక్షించేది లేదన్నారు. వందేభారత్ ఇతర రైళ్లపై రాళ్ల దాడులను కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. రైల్వే ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని.. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అసాంఘిక శక్తుల ఆటలు కట్టడి చేసి, రైల్వే ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చూస్తున్నట్లు ప్రకటించారు. ప్రయాణికులు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రయాణ సమయాల్లో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. విలువైన బంగారు నగలు ధరించడం, నగదు వెంట తెచ్చుకోవద్దని సూచించారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో కొత్త ప్రయాణికులు ఏదైనా తినుబండారాలు ఇస్తే తీసుకోవద్దన్నారు. మత్తు కలిపిన పదార్థాలు ఇచ్చి నిలువు దోపిడీ చేస్తారని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని ప్రయాణికులు కూడా కనీస జాగ్రత్తలు తీసుకుంటే నేరాలు జరిగే ఆస్కారం ఉండదన్నారు. ఆమె వెంట రైల్వే ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు

రైలు వేళల్లో మార్పు చేయాలని వినతి

అనంతపురం సిటీ: తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైలును ఉదయం 7 గంటలకు గుంతకల్లులో మొదలయ్యేలా చూడాలని గుంతకల్లు మండలం ఇమాంపురం, అన్నంపల్లి, నాగసముద్రం, కదిరేపల్లి, అయ్యవారిపల్లి, ఓబుళాపురం, దేవరపల్లికి చెందిన విద్యార్థులు కోరారు. బుధవారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు సంబంధించిన రహదారులు అధ్వానంగా తయారై రాకపోకలకు ఏమాత్రం అనుకూలంగా లేవని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి రైలు వేళల్లో మార్పు చేసేలా చొరవ చూపాలని విన్నవించారు. తిరుపతి నుంచి సాయంత్రం గుంతకల్లుకు వచ్చే రైలును కూడా 4:30 గంటలకు వచ్చేలా చూడాలని సూచించారు.

జిల్లాలో కోవిడ్ కేసు నమోదు

అనంతపురం మెడికల్: జిల్లాలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. పాతూరుకు చెందిన ఓ 30 ఏళ్ల గర్భిణీకి బుధవారం సర్వజనాస్పత్రిలో ర్యాపిడ్ యాంటీజెన్ పరీక్ష చేయగా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అడ్మిషన్ కావాలని పల్మనాలజీ వైద్యులు సూచించినా.. ఆమె నిరాకరించారు. ఇంట్లో ఐసోలేషన్‌లో ఉంటానని చెప్పడంతో జాగ్రత్తలు చెప్పి పంపించేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ 10 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా ఒకరికి పాజిటివ్ వచ్చిందని తెలిపారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి


డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం అర్బన్: వసతి గృహాలకు పెద్దపీట వేస్తామని.. హాస్టళ్లకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఏ ఒక్కటీ అమలు కాలేదని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. బుధవారం డీఆర్‌ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో సంఘం జిల్లా నాయకులు ఉదయ్ బాబు, అనందరాజు, తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం హాస్టళ్ల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. సాంఘీక సంక్షేమ వసతి గృహాలకు సన్నబియ్యం సరఫరా, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.